ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
మంగళవారం 10 డిసెంబరు 2024



రేపటి నుంచి తపాలా జీవిత బీమా మేళా

గుజరాతీపేట, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం తపాలా డివిజన్ పరిధిలోని అన్ని పోస్టాఫీసులలో ఈ నెల 11, 12వ తేదీల్లో తపాలా జీవిత బీమా మెగా మేళా నిర్వహించనున్నట్లు డివిజనల్ పోస్టల్ సూపరింటెండెంట్ హరిబాబు శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. 'ఈ మేళాలో రెండు కోట్ల ప్రీమియం సమీకరణే ధ్యేయం. దేశంలో ప్రతి వంద మందిలో 30 మందికి జీవిత బీమా ఉంది. పోస్టాఫీసులో జీవిత బీమాలు అతితక్కువ ప్రీమియంతో ఎక్కువ బోనస్‌ను అందిస్తాయి. సమీప పోస్టాఫీసులో ప్రతి ఒక్కరూ ఈ సేవలు వినియోగించుకుని.. కుటుంబాలకు భరోసా కల్పించాలని సూపరింటెండెంట్ తెలిపారు.

ఆర్మీ ఉద్యోగాల పేరిట టోకరా!

- బయటపడుతున్న 'ఆర్మీ కాలింగ్' నిర్వాహకుడి బాగోతాలు
- యువత నుంచి రూ.లక్షల్లో వసూలు
- 'మీ-కోసం'లో కలెక్టర్, ఏఎస్పీకి బాధితుల ఫిర్యాదు
- న్యాయం చేయాలని వేడుకోలు

ఆర్మీలో చేరి దేశానికి సేవ చేయాలనుకునే యువతను లక్ష్యంగా చేసుకున్నాడు. వారికి తన సంస్థ ద్వారా శిక్షణ ఇచ్చి ఉద్యోగాలిప్పిస్తానంటూ నమ్మించాడు. సైనిక శిక్షణ పేరిట రూ.లక్షల్లో వసూళ్లకు పాల్పడ్డాడు. కొంతమందికి నకిలీ సర్టిఫికెట్లు చూపించి.. ఆర్మీలో ఉద్యోగాలు ఖాయమంటూ నమ్మబలికేవాడు. తీరా ఉద్యోగాలు రాకపోవడంతో వారంతా మోసపోయామని గ్రహించారు. తమకు న్యాయం చేయాలంటూ 'మీ-కోసం' కార్యక్రమంలో కలెక్టర్, ఏఎస్పీకి ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే..

శ్రీకాకుళం క్రైం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని ఇండియన్ ఆర్మీ కాలింగ్ సంస్థ నిర్వాహకుడు బీవీ రమణ.. సైనిక శిక్షణ పేరిట యువకులను చితకబాదిన విషయం తెలిసిందే. ఏడాది కిందట జరిగిన ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి రావడంతో పోలీసులు విచారణ చేపట్టి ఆయనను అదుపులోకి తీసుకున్నారు. కాగా.. ఆయన శిక్షణ పేరిట రూ.లక్షల్లో వసూళ్లకు పాల్పడి తమను మోసం చేశారని తొమ్మిది మంది యువకులు ఆరోపిస్తున్నారు. తమకు న్యాయం చేయాలంటూ సోమవారం శ్రీకాకుళంలోని జడ్పీలో నిర్వహించిన మీ-కోసం కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు ఫిర్యాదు చేశారు. అలాగే జిల్లా పోలీసు కార్యాలయంలోని ఏఎస్పీ కేవీ రమణకు వినతిపత్రాన్ని అందజేశారు.

శ్రీముఖలింగం ప్రాంతానికి చెందిన బీవీ



ఇండియన్ ఆర్మీ కాలింగ్ సంస్థ కార్యాలయం

రమణ.. కనీసం డిగ్రీ కూడా పాసవ్వలేదు. పదేళ్ల కిందట శ్రీకాకుళంలోని ఇండియన్ ఆర్మీ కాలింగ్ సంస్థను నెలకొల్పాడు. కరోనా కారణంగా రెండేళ్ల పాటు ఉపాధి లేక నిరుత్సాహంలో ఉన్న యువతకు.. దేశ రక్షణలో కీలకమైన ఆర్మీలో ఉపాధి కల్పిస్తానంటూ నమ్మించాడు. తానూ ఓ ఆర్మీ ఉద్యోగినంటూ వేషధారణ వేసి.. గజపతినగరం, పోలాకి, గార ప్రాంతాలకు చెందిన యువత నుంచి రూ.లక్షల్లో వసూళ్లు చేశాడు. అంతటితో ఆగకుండా శిక్షణ సమయంలో వారిని చిత్రహింసలు పెట్టి నరకం చూపించాడంటూ బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగాల పేరిట తమను మోసగించాడంటూ.. పలువురు యువకులు ఎస్ (మిగతా 6వ పేజీలో..)



జడ్పీ కార్యాలయం వద్ద 'మీ-కోసం'లో ఫిర్యాదు చేసిన బాధితులు

ముమ్మరంగా ధాన్యం కొనుగోలు



నరసన్నపేట: మిల్లు వద్ద ధాన్యం అన్‌లోడ్ చేస్తున్న కలాసీలు

- రైతులకు తప్పిన అవస్థలు
- విక్రయించిన 24 గంటల్లో నగదు జమ

నరసన్నపేట, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు ముమ్మరంగా సాగుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ ఏడాది రైతులకు తిప్పలు తప్పాయి. గతేడాది ధాన్యం విక్రయాలకు సంబంధించి రైతులకు ఎక్కడో 30 కిలోమీటరు దూరంలో ఉన్న మిల్లులకు కేటాయించేవారు. జీపీఎస్ సదుపాయం ఉన్న వాహనాల్లోనే తరలించేలా నిబంధనలు ఉండేవి. దీంతో రైతులు ధాన్యం విక్రయించేందుకు వ్యయప్రయాస పడేవారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం నిబంధనలు సడలించడంతో.. కళ్లాల్లో ధాన్యం కొన్ని నిమిషాల్లోనే వారికి ఇష్టమొచ్చిన మిల్లులకు చేరవేస్తున్నారు. ధాన్యం విక్రయించిన 24 గంటల్లోపే రైతుల బ్యాంకు ఖాతాలో డబ్బులు జమవుతున్నాయి. జిల్లాలో సోమశనివారం నాటికి సుమారు 1.1లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు చేయగా.. దాదాపు రూ.16కోట్ల వరకూ చెల్లించారు. రవాణా, గన్నీ బ్యాగుల ఖర్చులు కూడా ప్రభుత్వం జమ చేస్తుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- జిల్లాలో ఈ ఏడాది 3.30 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం సేకరణకు (మిగతా 6వ పేజీలో..)

వ్యయప్రయాసలు తగ్గాయి



ఈఏడాది ప్రభుత్వం ధాన్యం రవాణాకు సంబంధించి జీపీఎస్ తొలగించడం.. నచ్చిన మిల్లుకు విక్రయించేలా వెసులుబాటు కల్పించడంతో వ్యయప్రయాసలు తగ్గాయి. కళ్లాల నుంచి కొద్ది సమయాల్లోనే మిల్లులకు ధాన్యం చేర్చుతున్నాం. కొనుగోలు కేంద్రాల్లో కూడా జాప్యం లేదు.

- పీస కృష్ణ, రైతు, చిన్నదూగాం, జలుమూరు మండలం

రైతులకు వరం



ధాన్యం కొనుగోలులో కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు రైతులకు వరంగా మారాయి. హార్వెస్టింగ్ చేపట్టిన ధాన్యాన్ని నేరుగా తేమ శాతం పరిశీలించి ఒక్కరోజులోనే మిల్లులకు పంపిస్తున్నాం. 24 గంటల్లోపే డబ్బులు జమ చేయడం ఆనందంగా ఉంది.

- జల్లు చంద్రమౌళి, ల్యాండ్ లార్డు, ఉర్లాం

జిల్లాలో 402 ధాన్యం కొనుగోలు కేంద్రాలు

- తుఫాన్‌పై అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



గుజరాతీపేట, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ధాన్యం సేకరణకు 402 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పేర్కొన్నారు. అలాగే తుఫాన్ కారణంగా ఈ నెల 11, 12వ తేదీల్లో జిల్లాలో వర్షాలు కురిసే అవకాశం ఉందని రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సోమవారం స్థానిక జిల్లాపరిషత్ కార్యాలయంలో జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి విలేకరులతో ఆయన మాట్లాడారు. 'తుఫాన్ నేపథ్యంలో వరిపంట కోతలు కోసి ఉంటే వెంటనే కుప్పలు వేసుకోవాలి. ఈ నెల 12వ తేదీ తర్వాత నూర్పులు చేసుకోవాలి. ధాన్యం సేకరణకు మిషనరీ, మిల్లర్లు సిద్ధంగా ఉన్నారు. ధాన్యం విక్రయించిన 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నాం. జిల్లాలో 4.9లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం కాగా.. ఇప్పటివరకూ 1.1లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశాం. రైతులకు ఇబ్బందులు లేకుండా మిల్లర్లకు తగు సూచనలు జారీ చేశామ'ని కలెక్టర్ తెలిపారు.



లావేరు : సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్

రైతులకు ముందే సంక్రాంతి

- 48 గంటల్లో ధాన్యం నగదు జమ
- జిల్లాలో 5 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణ లక్ష్యం
- ఏఐ టెక్నాలజీతో సేవలు
- రూ. 40కోట్లతో ధాన్యం ఆరబెట్టే పరిశ్రమ ఏర్పాటు
- రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

శ్రీకాకుళం/ లావేరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో రైతులందరికీ సంక్రాంతి ముందే వచ్చింది. ధాన్యాన్ని సేకరించిన 24 నుంచి 48 గంటల్లోనే వారి ఖాతాల్లో నగదు జమచేస్తున్నాం. దళారులకు ధాన్యాన్ని విక్రయించుకోవద్దు. ప్రతి గింజా కొంటామ'ని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా చేపట్టాలని రైతులకు ఇబ్బంది పెడితే కఠినచర్యలు తప్పవని అధికారులను హెచ్చరించారు. సోమవారం లావేరు మండలం బుడుమూరు పంచాయతీ కలిశెట్టిగూడెంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత ధాన్యం కొనుగోలు ప్రక్రియ సంస్కరణలు చేపట్టాం. గత ప్రభుత్వం రైతులకు చెల్లించాల్సిన బకాయిలను మేమే చెల్లించాం. జిల్లాలో 5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా నిర్ణయించాం. దళారుల మాట నమ్మి తక్కువ ధరకు ధాన్యం విక్రయించొద్దు. అకాల వర్షాల దృష్ట్యా తేమ 24శాతం ఉన్నా ధాన్యం కొనుగోలు చేస్తున్నాం. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో 72,017 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెల వ్యవధిలోనే లక్షా 15 వేల మెట్రిక్ టన్నులు ధాన్యాన్ని కొనుగోలు చేశాం. ఇప్పటి వరకు రైతుల ఖాతాల్లో రూ.253 కోట్లు నగదును జమ చేశాం. వ్యవసాయాధారితమైన సిక్కోలులో రూ.40కోట్ల పెట్టుబడితో ధాన్యం ఆరబెట్టే.. ఎండబెట్టే పరిశ్రమ ఏర్పాటుకు కృషి చేస్తామ'ని తెలిపారు. వాట్సాప్‌లో రైతు 'హాయ్' అని మెసేజ్ చేస్తే వ్యవసాయ శాఖకు సంబంధించి మొత్తం సమాచారం అందేలా 'ఏఐ' టెక్నాలజీని రూపొందించామన్నారు. జిల్లా నుంచి వలసల నివారణ ధ్యేయంగా పనిచేస్తామని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు మాట్లాడుతూ నారాయణపురం, తోటపల్లి సాగునీటి కాలువ పనులు పూర్తి చేస్తే.. ఈ ప్రాంతంలో ఎక్కువ భూమి సాగులోకి వస్తుందని తెలిపారు. ఈ దిశగా చర్యలు చేపట్టాలని మంత్రిని కోరారు. కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్‌దినకర్, జిల్లా వ్యవసాయశాఖ జేడీ త్రినాథస్వామి, సివిల్ సప్లయ్ డైరెక్టర్ శివదత్, జిల్లా సివిల్ సప్లయ్ డీఎం వేణుగోపాల్, మండల టీడీపీ అధ్యక్షుడు ముప్పిడి సురేష్, తహసీల్దార్ వె.జోగారావు, ఎంపీడీవో వెంకటరాజు, వ్యవసాయశాఖ ఏడీఏ వి.శ్రీనివాసరావు, కూటమి నాయకులు నల్లి లక్ష్మునాయుడు, పండి గోపాలరావు పాల్గొన్నారు.

పత్రమూ లేదు.. డబ్బులూ లేవు!

- జిల్లాలో అపహాస్యంగా ఓటీఎస్
- అతీగతీ లేని జగనన్న సంపూర్ణ గృహ హక్కు పథకం
- కూటమి ప్రభుత్వమే న్యాయం చేయాలని లబ్ధిదారుల వేడుకోలు

ఇచ్ఛాపురం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): గృహ నిర్మాణ లబ్ధిదారులను వన్‌టైమ్ సెటిల్‌మెంట్ (ఓటీఎస్) పేరిట గత వైసీపీ ప్రభుత్వం దారుణంగా మోసం చేసింది. ఎప్పుడో ఎన్టీఆర్ హయాం నుంచి మొన్నటి కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వం వరకూ గృహ నిర్మాణ పథకంలో భాగంగా మంజూరైన ఇళ్లకు వైసీపీ సర్కారు జగనన్న సంపూర్ణ గృహ హక్కు పథకం తీసుకొచ్చింది. అయితే దశాబ్దాల కిందట నిర్మించిన ఇళ్లకు కొలతలు తీసి సంపూర్ణ గృహ హక్కు కల్పిస్తామని అధికారులు నమ్మబలికారు. చాలామంది వద్ద కోట్లాది రూపాయలు కట్టించుకున్నారు. అయితే ఇది జరిగి మూడేళ్లు గడుస్తున్నా దానికి సంబంధించి సంపూర్ణ గృహ హక్కు పత్రాలు ఇంతవరకూ మంజూరు చేయలేదు. తమ డబ్బులైనా తిరిగి ఇవ్వాలని.. లేదంటే ధ్రువపత్రాలైనా అందించాలని కోరుతున్నారు.

నాలుగు కేటగిరీలుగా..

జగనన్న సంపూర్ణ గృహ హక్కు పథకం కింద అప్పట్లో లబ్ధిదారులను నాలుగు కేటగిరీలుగా విభజించారు. కేటగిరి-ఎ కింద లబ్ధిదారుడు గృహనిర్మాణ సంస్థ నుంచి అప్పు తీసుకొని మృతిచెందితే.. వారి వారసులకు పట్టా అందిస్తారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇల్లు ఉంటే రూ.10వేలు, మునిసిపాలిటీల్లో రూ.15వేలు, కార్పొరేషన్‌లో రూ.20 చొప్పున వసూలు చేశారు.

- కేటగిరి-బికి సంబంధించి రుణం తీసుకున్న వ్యక్తి నుంచి ఇతరులు ఆ ఇంటిని కొనుగోలు చేసి నా క్రమబద్ధీకరించుకోవడానికి అవకాశమిచ్చారు. ఇందుకుగాను గ్రామీణ ప్రాంతాల్లో రూ.20వేలు, మునిసిపాలిటీల్లో రూ.30వేలు, కార్పొరేషన్ పరిధిలో రూ.40వేలు వసూలు చేపట్టారు.
- కేటగిరి-సీకి సంబంధించి ప్రభుత్వ రుణం పొందకుండా.. సొంతంగా ఇంటిని నిర్మించుకున్న వారి నుంచి రూ.10 వేలు చొప్పున వసూలు చేశారు.
- కేటగిరి-డి కింద ప్రభుత్వం పట్టా ఇచ్చిన తర్వాత.. దానిని అమ్ముకుంటే కొనుగోలు చేసిన వారి వద్ద గ్రామీణ ప్రాంతాల్లో రూ.10వేలు, మునిసిపాలిటీల్లో రూ.15వేలు, కార్పొరేషన్‌లో రూ.20 వేల వంతున వసూలు చేశారు.

ఇదీ పరిస్థితి..

జిల్లావ్యాప్తంగా అధికారులు, సచివాలయ సిబ్బంది ఓటీఎస్ పేరిట గృహ నిర్మాణ లబ్ధిదారుల నుంచి బలవంతంగా (మిగతా 6వ పేజీలో..)



ఓటీఎస్ పత్రాలను లబ్ధిదారులకు అందిస్తున్న సచివాలయ సిబ్బంది (ఫైల్)

'నరసన్నపేట-ఇచ్ఛాపురం' హైవేను విస్తరించాలి

- కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు

శ్రీకాకుళం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సమగ్ర అభివృద్ధిలో భాగమయ్యేలా.. జిల్లాలోని జాతీయ రహదారి-16ను మరింత అభివృద్ధి చేయాల్సి ఉందని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అభిప్రాయం వ్యక్తం చేశారు. నరసన్నపేట-ఇచ్ఛాపురం మధ్య ఉన్న జాతీయ రహదారిని ఆరు లేన్లకు విస్తరించాలని సూచించారు. సోమవారం విశాఖపట్నంలో శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలసి హైవే అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇప్పటికే విశాఖపట్నం-నరసన్నపేట వరకు వంద కిలోమీటర్ల మేర ఆరు లేన్ల జాతీయ రహదారి ఉందని, ఒడిశా సరిహద్దు ఇచ్ఛాపురం వరకు కూడా ఇదే విధంగా విస్తరణ చేపట్టాలని తెలిపారు. దీని కారణంగా ప్రయాణం, సరుకు రవాణా వేగవంతం చేయవచ్చన్నారు. నూతనంగా నిర్మాణం కానున్న భోగాపురం-మూలపేట పోర్టును అనుసంధానం చేసేలా విశాఖపట్నం-మూలపేట బీచ్ కారిడార్ రోడ్డు ప్రతిపాదనలపై పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ నిర్మాణం పూర్తయితే జిల్లాలోని మత్స్యకార గ్రామాలను జాతీయ రహదారితో కలపడంతో పాటు ఎగుమతులు పెరిగి మత్స్యకారుల జీవన ప్రమాణాలు పెంచవచ్చని తెలిపారు. అలాగే శ్రీకాకుళం నగరంలోకి వాహనాలు సులభంగా రాకపోకలు సాగించేలా నవభారత జంక్షన్ నుంచి బైపాస్ వరకు ఉన్న జాతీయ రహదారిపై అప్రోచ్ రోడ్డు నిర్మాణం, అభివృద్ధి పనులు చేపట్టాలని ఆదేశించారు. దీనిపై స్పందించిన హైవే అధికారులు.. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి, పనుల వేగవంతానికి కృషి చేస్తామని వెల్లడించారు.



మాట్లాడుతున్న కేంద్రమంత్రి రామ్మోహన్



గారలో సంత(ఫైల్)

నీడా ఉండదు.. నీరూ ఉండదు..

- వారపు సంతల్లో కనీస సౌకర్యాలు కరువు
- అభివృద్ధిని పట్టించుకోని అధికారులు
- వ్యాపారులు, పాడిరైతుల గగ్గోలు

గార/ కోటబొమ్మాళి/ హరిపురం/ఆమదాలవలస, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): వారపు సంతల్లో కనీస సౌకర్యాలు కరువవుతున్నాయి. తాగునీరు, మరుగుదొడ్లు వంటి సదుపాయాలు లేక రైతులు, వ్యాపారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గారలో ప్రతీ మంగళవారం జరిగే వారపు సంత కొనుగోలుదారులతో కళకళలాడేది. రైతులు పండించే కూరగాయలతోపాటు.. కులవృత్తుదారులు తాము తయారు చేసే వస్తువులు ఇక్కడకు తెచ్చి విక్రయించేవారు. కాగా.. కనీస వసతులు కరువై.. మరోవైపు ఇళ్ల వద్దకే నిత్యావసర సరుకులు తెచ్చి విక్రయిస్తుండడంతో సంతలకు ఆదరణ కరువవుతోంది. మరిన్ని సంతల్లో దుస్థితిపై కథనాలు...

6 లో

మూసివేసిన పరిశ్రమలే లక్ష్యం

- పట్టుబడిన కాపర్ దొంగలు

8 లో

హత్య కేసును ఛేదించిన పోలీసులు

- భూవివాదమే కారణమని గుర్తింపు
- ఎనిమిది మంది అరెస్టు

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

- ఆకట్టుకున్న జిల్లాస్థాయి 'కళా ఉత్సవ్'



ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శన

6 లో



నారాయణవలస సంతలో ఎండలోనే ఉన్న పశువులు



అసౌకర్యాల నడుమ చింతాడ సంత

నీడా నీరూ ఉండదు..

పేదల సూపర్‌బజార్లగా పేరొందిన వారపు సంతలు సమస్యల లోగిళ్లుగా మారాయి. వీటిద్వారా రూ.లక్షల్లో ఆదాయం వస్తున్నా కనీస సౌకర్యాలకు నోచుకోవడం లేదు. తాగునీరు, మరుదొడ్లు, షెడ్లు, ఫ్లోరింగ్, సిమెంట్ బల్లలు వంటి సదుపాయాలు కరువయ్యాయి. వేసవిలో నీడ కోసం, వర్షం పడితే తడిసిపోకుండా చెట్ల కిందకు పరుగెత్తాల్సిందే. కొన్ని సంతలకు స్థలాలు లేక రోడ్లపైనే వ్యాపారాలు సాగిస్తున్నారు.

- వారపు సంతల్లో కనీస సౌకర్యాలు కరువు
- నేలపైనే దుకాణాలు ● వర్షం పడితే చిత్తడే
- ఆదాయం వస్తున్నా అభివృద్ధిని పట్టించుకోని అధికారులు
- వ్యాపారులు, పాడిరైతుల గగ్గోలు

ఆదాయం ఫుల్.. సౌకర్యాలు నిల్

కోటబొమ్మాళి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అతిపెద్ద పశువుల సంత నారాయణవలస. ఈ సంతకు వందేళ్ల చరిత్ర ఉంది. ప్రతి గురువారం జరిగే ఈ సంత ద్వారా రూ.లక్షల్లో ఆదాయం వస్తుంది. అన్ని వర్గాల వ్యాపారులు బుధవారం రాత్రికే సంతకు చేరుకొని దుకాణాలు ఏర్పాటు చేసుకుంటారు. పశువులు, గొర్రెలు, కోళ్లు, చేపలు, కూరగాయలు, బట్టలు, మంచాలు, తలుపులు, ద్వారాలు వంటి వ్యాపారాలు నిర్వహిస్తారు. ఇక్కడ వారానికి రూ. 5లక్షల వ్యాపార లావాదేవీలు జరుగుతాయి. ఏటా ఆశీల వేలం రూ.లక్షల్లో ఉంటుంది. ప్రస్తుతం ఈ వేలం పాట సుమారు రూ.80 లక్షలకు సమీపించింది. ఇంత ఆదాయం వస్తున్నా అభివృద్ధికి మాత్రం నోచుకోవడం లేదు. సంతలోని వాటర్ ట్యాంకు పనిచేయడం లేదు. పశువులు తాగేందుకు నీరు ఉండడం లేదు. అలాగే, వాటికి నీడ కూడా కరువైంది. ఇప్పటికైనా అధికారులు ఈ సంతను అభివృద్ధి చేయాలని వ్యాపారులు కోరుతున్నారు.

తాగునీటి సదుపాయం కల్పించాలి..

ఈ సంతకు పశువులు తీసుకువచ్చినప్పుడు వాటికి తాగేందుకు నీరు ఉండడం లేదు. ఎండ కాలంలో ఇక్కడకు పశువులు తీసుకురావడానికి భయపడుతున్నాం. అధికారులు స్పందించి తాగునీటి సౌకర్యం కల్పించాలి.

-లింగుబారి ఈశ్వరరావు, హరిశ్చంద్రపురం

వసతులు మెరుగుపరుస్తాం..

నారాయణవలస పశువుల సంతలో వసతులు మెరుగుపరుస్తాం, నేను ఇటీవల బాధ్యతలు చేపట్టాను. సంతలో ఇబ్బందులు నా దృష్టికి వచ్చాయి. త్వరలో అన్ని సమస్యలు పరిష్కరిస్తాం.

-కె.ఫణీంద్రకుమార్, ఎంపీడీవో, కోటబొమ్మాళి



సంతలో పనిచేయని వాటర్ ట్యాంకు



● ఇది మందస సంత. ప్రతి సోమవారం జరిగే ఈ సంత స్థల సమస్యతో కొట్టుమిట్టాడుతోంది. రోడ్డుపైనే వ్యాపారులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. సోమవారం వచ్చిందంటే చాలు రోడ్డుపై ట్రాఫిక్ జామ్ ఏర్పడి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

స్థలాలు కరువు..

హరిపురం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మందస, పలాస సంతలకు స్థలాలు కరువయ్యాయి. దీంతో రోడ్లపైనే సంతలు కొనసాగుతుండడంతో ప్రజలు, అమ్మకందారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వర్షాకాలంలో ఇక్కట్లు అన్నీఇన్నీ కావు. సంత జరిగే సోమవారం రోజున మందసలో ట్రాఫిక్‌కు తీవ్ర అతరాయం కలుగుతుంది. శుక్రవారం నిర్వహించే కాశీబుగ్గ సంతతో పాఠశాల విద్యార్థులు, వాహనదారుల సమస్యలు అన్నీఇన్నీ కావు. పూండి, అంబుగాం సంతలకు ఖాళీ స్థలాలు ఉన్నా అవి సరిపోక రోడ్లపైనే అమ్మకాలు కొనసాగించాల్సిన దుస్థితి. ప్రజల సౌకర్యార్థం ఎంతో ఉపయోగకరమైన సంతలు ఇక్కట్లు, ఇబ్బందుల నడుమ కొనసాగుతున్న పరిస్థితి ఏర్పడింది. గ్రామీణ ప్రజల సౌకర్యార్థం సంతలకు ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, అధికారుల చేయూత ఎంతో అవసరం.

సమస్యలు పరిష్కరించాలి..

గిరిపుత్రులు ఎక్కువగా సంతలపైనే ఆధార పడి జీవనం సాగిస్తుంటారు. వీటి నిర్వహణలో అధికారుల పర్యవేక్షణ చేపట్టి నకిలీలకు అడ్డుకట్ట వేయాలి. సంతల్లో సమస్యలను పరిష్కరించాలి. ప్రభుత్వ స్థలాలను సంతలకు కేటాయించి మౌలిక సదుపాయాలు కల్పించాలి. ప్రభుత్వం ఈ దిశగా చర్యలు తీసుకోవాలి.

- సవర జగన్, సాబకోట

వర్షం పడితే ఇక్కట్లే..

ఆమదాలవలస, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘం పరిధిలోని ఏడో వార్డు చింతాడలో ప్రతి శనివారం జరిగే సంతలో కనీస సౌకర్యాలు లేవు. ప్రతి ఏటా మార్చిలో పురపాలక సంఘం ఈ సంతకు బహిరంగ వేలం పాట నిర్వహిస్తుంటుంది. 2021-22లో రూ.8 లక్షలకు చింతాడ గ్రామానికి చెందిన వ్యక్తులే సంత ఆశీల పాటను కైవసం చేసుకున్నారు. ఆ తర్వాత ప్రభుత్వం ప్రతి ఏటా ఆశీల పాటను కొంతమొత్తంలో పెంపుదల చేయడంతో వేలంలో పాల్గొనడానికి ఎవరూ ముందుకు రాలేదు. దీంతో సచివాలయ సిబ్బంది ఆశీలను వసూలు చేస్తున్నారు. సంతలో షెడ్లు, ఫ్లోరింగ్ తదితర సదుపాయాలు లేవు. సంతకు వచ్చే మహిళలు, వృద్ధులు కాలకృత్యాలు తీర్చుకోవాలంటే పొలాలు, ముళ్లపొదలు చాటుకు వెళ్లాల్సిందే. తాగేందుకు మంచి నీరు లేక ఇక్కట్లు పాలవుతున్నారు. సంతలో కొన్నేళ్ల కిందట బోరు ఏర్పాటు చేశారు. ఈ నీరు తాగేందుకు పనికి రాదు. నేలపై దుకాణాలు ఏర్పాటు చేయడంతో వర్షాలు పడేటప్పుడు సరుకులు తడిసిపోతున్నాయని వ్యాపారులు గగ్గోలు పెడుతున్నారు. సంతకు వచ్చే రైతులు, ప్రజలు కూడా వర్షంలో తడవకుండా చెట్ల కిందకు పరుగెత్తాల్సిందే. 2014-19లో రూ.5లక్షలతో నిర్మించిన మరుగుదొడ్లకు రన్నింగ్ వాటర్ సదుపాయం లేక వినియోగంలోకి రాలేదు. ప్రస్తుతం మరుగుదొడ్ల శిథిలావస్థకు చేరాయి. ఇప్పటికైనా సంతపై దృష్టి పెట్టాలని కోరుతున్నారు.



నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్డు

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

● ఆకట్టుకున్న జిల్లా స్థాయి 'కళా ఉత్సవ్'

గార, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): వమరవల్లి జిల్లా విద్యా శిక్షణా సంస్థ (డైట్)లో సోమవారం ఉదయం జిల్లా స్థాయి 'కళా ఉత్సవ్' ఘనంగా జరిగింది. జిల్లాలో ఉన్న వివిధ పాఠశాలలకు చెందిన వందమంది విద్యార్థులు ఈ ఉత్సవ్‌లో పాల్గొన్నారు. శాస్త్రీయ సంగీతం, జానపద నృత్యం, వివిధ వాయిద్య విభాగ పోటీల్లో విద్యార్థులు పాల్గొని ప్రతిభ చూపారు. డీఈవో, డైట్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డైట్ వైస్ ప్రిన్సిపాల్ ఎం.భారతమ్మ, అధ్యాపకులు గౌరీశంకర్, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు పలు విభాగాల్లో మొదటి స్థానంలో నిలవగా, ట్రెడిషినల్ స్టోరీ టెల్లింగ్ విభాగంలో శ్రీకాకుళం ఆక్స్‌ఫర్డ్ పాఠశాల విద్యార్థి హాస్నిక మొదటి స్థానం పొందినట్టు డీఈవో ప్రకటించారు.

● కోటబొమ్మాళి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): కళాఉత్సవ్‌లో కొత్తపల్లి జిల్లా పరిషత్ ప్రభుత్వం పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ చూపారు. జిల్లా స్థాయి జానపద నృత్య విభాగంలో చుక్క ఊర్వశి, పట్నాన దివ్యశ్రీ ద్వితీయ స్థానంలో, 2డీ ఆర్ట్ విభాగంలో పట్నాన దివ్యశ్రీ ద్వితీయ స్థానంలో నిలిచారు. వీరిని డీఈవో డీఈవో తిరుమల చైతన్య, డైట్ వైస్ ప్రిన్సిపాల్ ఎం.భారతమ్మ తదితరులు అభినందించారు.



ఆకట్టుకుంటున్న విద్యార్థుల ప్రదర్శన

రాష్ట్రస్థాయి పోటీలకు కవిటి విద్యార్థులు

కవిటి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి కళాఉత్సవ్-2024కు ఎంపికైనట్టు హెచ్ఎం బి.మల్లేశ్వరరావు తెలిపారు. వమరవల్లి డైట్‌లో నిర్వహించిన పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు ఆరు విభాగాల్లో మొదటి స్థానాన్ని సంపాదించారని తెలిపారు. జానపద నృత్యం, జానపద గీతం గ్రూపు, త్రీడీ ఆర్ట్, మ్యూజిక్ గ్రూపు విభాగాల్లో స్థానాన్ని సాధించారన్నారు. విజయవాడలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు వెళ్లనున్నారని, ఇందుకు కవిటికి చెందిన ఉషోదయ యువజన సంఘం సభ్యులు సోమవారం రూ.12 వేలు సాయాన్ని అందించినట్టు తెలిపారు.



కళాఉత్సవ్‌లో ఎంపికైన విద్యార్థులతో డైట్ సిబ్బంది

ఆర్మీ ఉద్యోగాల పేరిట.. టోకరా.!

(ఐదో పేజీ తరువాయి)

సర్వీస్‌మెన్ జేఏసీని ఆశ్రయించారని జేఏసీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఎస్ఎన్ మూర్తి, రామారావు, గౌరవాధ్యక్షులు శంకరనారాయణ, ఏవీఆర్ మూర్తి విలేకరులకు తెలిపారు. తమను వారం రోజుల కిందటే కలిసి సమస్య వివరించారన్నారు. ఈ నేపథ్యంలో బాధితులకు అండగా నిలిచి.. నిర్వాహకుడిపై కలెక్టర్‌కు, ఏఎస్పీకి, రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. బాధితులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

● ఇండియన్ ఆర్మీ కాలింగ్ సంస్థలో చేరి శిక్షణ పొందిన సేనాపతి రఘుకి సంస్థ నిర్వాహకుడు బీవీ రమణ ఆర్మీలో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి రూ.4 లక్షలు తీసుకున్నాడు. ఏళ్లు గడుస్తున్నా ఉద్యోగం ఇవ్వకపోవడంతో సోమవారం వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై ఎస్ఐ హరికృష్ణ కేసు నమోదు చేశారు.

ఉద్యోగం కోసం రూ.5లక్షలిచ్చాం

ఆర్మీలో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పడంతో 2021లో ఇండియన్ ఆర్మీ కాలింగ్ సంస్థలో చేరాను. ఆరు నెలలు శిక్షణ ఇచ్చి.. ఓ నకిలీ ఆర్డర్ కాపీ చూపించి, ఉద్యోగాలు గ్యారంటీ అని చెప్పి రూ.5లక్షలు తీసుకున్నాడు. శిక్షణ కాలంలో ఇంటికి కూడా ఫోన్ చేసే అవకాశం కల్పించలేదు. శిక్షణ వీడియోలను మా సెల్ ఫోన్లో చిత్రీకరించి యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేయించి ప్రమోషన్ చేయించుకునేవారు. మూడేళ్ల అయింది గాని ఉద్యోగం మాత్రం రాలేదు. అడగితే తప్పించుకుని తిరుగుతున్నారు. ఎవరు లేని సమయంలో, సీసీ కెమెరాలు లేని చోట రూ.5 లక్షలు ఇమ్మని ఒత్తిడి చేసి తీసుకున్నారు.

- ఎస్.జగదీష్, పాతబగ్గం, గజపతినగరం మండలం, విజయనగరం జిల్లా

ఆర్మీ ఉద్యోగినంటూ నమ్మించాడు

మాది విజయనగరం జిల్లా గజపతి నగరం మండలం పురిటిపెంట గ్రామం. ఇండియన్ ఆర్మీ కాలింగ్ నిర్వాహకుడు బీవీ రమణతో 2020లో పరిచయం ఏర్పడింది. మా ఇళ్లకు ఆర్మీ దుస్తుల్లో వచ్చి తాను ఆర్మీలో పని చేశానని నమ్మించి ఉద్యోగం ఇప్పిస్తానని, ఇందుకు ఒక్కొక్కరికి రూ.5లక్షలు ఖర్చు అవుతుందని చెప్పాడు. ఇది నమ్మిన మేము చెరో రూ.5లక్షలు చొప్పున కొంత మొత్తం ఫోన్ పే ద్వారా, మరికొంత ఆన్‌లైన్ ఖాతాకు ఇంకొంత నగదుగా చెల్లించాం. ఏళ్లుగడుస్తున్న ఉద్యోగం రాకపోవడంతో నిలదీయగా.. కాస్త ఓపిక పట్టండం తప్పవకుండా ఉద్యోగి వస్తుందని చెప్పుడుకుంటూ వస్తున్నాడు. ఈ క్రమంలో రమణ భాగోతం టీవీల్లో రావడంతో తాము మోసపోయినట్టు గ్రహించి.. శ్రీకాకుళం జిల్లా ఎక్స్ ఆర్మీజవాన్ జేఏసీ సభ్యులను రలిసి వారి సహకారంతో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాం.

- క్రిష్ణప్రసాద్, ప్రవీణ్, బాధితులు

చిత్రహింసలు పెట్టేవారు

ఆర్మీలో ఉద్యోగం వస్తుందని చెప్పడంతో 2023 ఆగస్టులో ఇండియన్ ఆర్మీ కాలింగ్ సంస్థలో చేరాను. శిక్షణా సమయంలో చిత్రహింసలు పెట్టేవారు. ఆయన కార్యాలయంలో అమ్మాయిలు ఉంటే పొర పాటున వెళ్తే నరకం చూపించేవాడు. ఉద్యోగానికి రూ.5లక్షలు ఖర్చు అవుతుందటే, అప్పు చేసి కట్టి మోస పోయాం.

- పి.జగదీష్, సింగుపురం

ఆర్మీలో లెఫ్టినెంట్‌నని నమ్మించాడు

మా ఇంటికి వచ్చి ఆర్మీలో లెఫ్టినెంట్‌నని నిమ్మించాడు. ఆర్మీలో ఉద్యోగం ఇప్పిస్తానని రూ.5లక్షలు ఇవ్వమన్నాడు. దీంతో అతడిని నమ్మి నమ్మి రూ.5లక్షలు రమణకు ఇచ్చాను. ఇండియన్ ఆర్మీ కాలింగ్ శిక్షణకు చేరాక నరకం చూశాం. రమణ అనుచరులు శాలిన కిరణ్, శ్రీకాంత్ కూడా అకాడమీలో చేయని ఆకృత్యాలు లేవు. ఉద్యోగం పేరుతో డబ్బులు ఇచ్చి మొసపోయాం.

- పి.పోలినాయుడు సింగుపురం

డబ్బులు ఇవ్వంటే బెదిరించారు

మా అక్క అక్కడే శిక్షణ పొందింది. మా ఇంటికి వచ్చి ఆర్మీలో ఉన్నతస్థాయి ఉద్యోగులు తెలుసునని, తాను కూడా ఆర్మీ ఉద్యోగినని రమణ నమ్మించాడు. దీంతో మా నాన్నతో 2022లో రూ.3.5లక్షలు కట్టించుకున్నారు. ట్రైనింగ్‌లో రూ.20 వేలు విలువ చేసే సెల్‌ఫోన్ బద్దలు కొట్టారు. నకిలీ సర్టిఫికెట్ ఇచ్చి మళ్లీ తీసుకున్నారు. ఉద్యోగం రాకపోవడంతో డబ్బులు ఇవ్వాలని నిలదీస్తే మమ్మల్ని కొట్టిస్తానని బెదిరించాడు.

- కె.పాపారావు, గార

ముమ్మరంగా ధాన్యం కొనుగోలు

(ఐదో పేజీ తరువాయి)

ప్రభుత్వం నిర్ణయించింది. అందుకు గాను జిల్లాలో నిమ్మాడ, రావిపాడు,నరసన్నపేట, తదితర ప్రాంతాల్లో ఉన్న 12 గోదాములను సిద్ధం చేశారు. కస్టమ్స్ మిల్లింగ్ విధానంలో మిల్లర్ల నుంచి బియ్యాన్ని సేకరిస్తున్నారు. ధాన్యం కొనుగోలు ముమ్మరంగా సాగుతున్న నేపథ్యంలో.. మిల్లర్ల నుంచి బియ్యం సేకరణ కూడా వేగవంతం చేయాలని ఇటీవల జేసీ ఆదేశించారు.

వానరాల నుంచి రక్షణగా..

హరిపురం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మందస మండలంలో సిరిపురం, పొత్తంగి, జీఆర్ పురం, డబారు, బెల్లుపటియా, భోగాపురం తదితర గ్రామాల ప్రజలను వానరులు (కోతులు) తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఆయా గ్రామాల్లో ఇంటిపై ఏమిపెట్టినా.. రెండో రోజుకే వాటి రూపు టరేఖలు మారిపోతున్నాయి. పంటలు నాశనం చేస్తుండగా.. రైతులు ఆందోళన తప్ప ఏమిచేయలేని దుస్థితి. దీంతోపాటు ఇంటిపై టీవీలకోసం పెట్టిన డిష్ యాంటీనాలు, టవర్‌లు, సిమెంటు పెంకులు వేసినా రెండురోజులకే పీకిపారేస్తున్నాయి. వీటి నుంచి కాపాడుకునేందుకు గ్రామాల్లో డిష్‌యాంటినాలపై వెదురు ముళ్ల కంచె రక్షణగా పెడుతున్నారు. ముళ్ల కంచె పెట్టిన నుంచి కాస్త ఉపశమనం లభించిందని పొత్తంగి గ్రామస్థులు చెబుతున్నారు. దీంతో ఆయా గ్రామాల్లో ఎక్కడ చూసినా ఇంటిపై డిష్‌లు.. వాటిపై ముళ్ల కంచెలు కనిపిస్తున్నాయి. మరికొంతమంది ఇనుప జాలీతో బాక్స్‌లు తయారు చేసి పెడుతున్నారు.



పొత్తంగిలో టీవీ డిష్‌పై వెదురు ముళ్ల కంచె పెట్టిన దృశ్యం

పత్రమూ లేదు.. డబ్బులూ లేవు!

(ఐదో పేజీ తరువాయి)

డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలున్నాయి. జిల్లాలో 1983-2011 మధ్య 4 లక్షల మంది లబ్ధిదారులు ఉన్నట్టు అప్పట్లో గుర్తించారు. వీరి వద్ద నుంచి రూ.120కోట్లు వసూలు చేయాలని నిర్ణయించారు. కానీ జిల్లావ్యాప్తంగా ఒత్తిడి చేసి రూ.10 కోట్లు వసూలు చేసినట్టు గణాంకాలు చెబుతున్నాయి. ఓటీఎస్ విషయంలో లబ్ధిదారులే కాదు.. అధికారులు, సచివాలయ సిబ్బంది అందరూ బాధ్యులే. ఇంతవరకూ లబ్ధిదారులకు సరైన డాక్యుమెంట్లు ఇవ్వలేదు. పేదల పింఛన్లు తొలగిస్తామని, సంక్షేమ పథకాలు నిలిపివేస్తామని అప్పట్లో బెదిరించారు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో ముడి పెట్టారు. రుణాలు తీసుకున్నవారు తప్పకుండా రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిందేనని ఒత్తిడి పెంచారు. డ్వాక్రా గ్రూపుల్లో ఉన్నవారితో రుణాలు ఇప్పించి మరీ రిజిస్ట్రేషన్లు చేయించారు. అయితే ఇలా రిజిస్ట్రేషన్లు చేసుకున్నా చాలామందికి ఇప్పటికీ డాక్యుమెంట్లు ఇవ్వలేదు. మరికొందరికి ఇచ్చినా అందులో వివరాలు తప్పుగా నమోదయ్యాయి. అప్పట్లో లక్ష్యం పూర్తిచేయని సచివాలయ సిబ్బందిపై వేటు కూడా వేసిన సందర్భాలున్నాయి. ఇంత చేసినా లబ్ధిదారులకు మాత్రం న్యాయం చేయలేకపోయారు. ఇప్పుడు తమకు న్యాయం చేయాలంటూ కూటమి ప్రభుత్వానికి లబ్ధిదారులు విజ్ఞప్తి చేస్తున్నారు. మండల, జడ్పీలోని నిర్వహించిన 'మీ-కోసం' కార్యక్రమంలో వినతిపత్రాలు అందజేస్తున్నారు. తాము చెల్లించిన డబ్బులైనా ఇవ్వాలని, లేదంటే ధ్రువపత్రాలైనా అందజేయాలని వేడుకుంటున్నారు.

అలరించిన ప్రదర్శనలు



బుర్రకథ ప్రదర్శన

● ముగిసిన రంగస్థల కళాకారుల సమాఖ్య రజతోత్సవ వేడుకలు

శ్రీకాకుళం కల్చరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం రంగస్థల కళాకారుల సమాఖ్య రజతోత్సవాలు సోమవారంతో ముగిశాయి. మూడు రోజులపాటు సాగిన ఈ కార్యక్రమంలో పలువురు కళాకారులు ప్రతిభ చూపారు. ఈ సందర్భంగా పలు ప్రదర్శనలు అలరించాయి. సమాఖ్య సభ్యుడు బగ్గామ్ అప్పాజీ.. అల్లూరి సీతారామరాజు బుర్రకథ ప్రదర్శించారు. అనంతరం మిమిక్రీ కళాకారుడు లోకనాథం నందికేశ్వరరావు.. సినీనటుల డైలాగ్స్ జంతువులు, పక్షులు, అరుపులు మిమిక్రీ చేస్తూ ఆకట్టుకున్నారు. అనంతరం సత్యహరిశ్చంద్ర పౌరాణిక నాటిక ప్రదర్శించారు. కిట్టలపాడుకు చెందిన రాయి శ్రీనివాసరావు, ఒకటవ హరిశ్చంద్రగా, గంట మంగాదేవి 2వ హరిశ్చంద్రగా, యడ్ల గోపాలం నక్షత్రకుడిగా, భానుమతి చంద్రమతిగా నటించారు. ఈ సందర్భంగా పలువురు కళాకారులను సత్కరించారు.

చరిత్ర సృష్టించిన సమాఖ్య

శ్రీకాకుళం కల్చరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం రంగస్థల కళాకారుల సమాఖ్య వివిధ కార్యక్రమాలు చేపడుతూ 25 ఏళ్ల నిర్విరామంగా కొనసాగించి చరిత్ర సృష్టించారని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. సోమవారం ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రంగస్థల కళాకారులకు ప్రభుత్వం తరుపున సాయం అందేలా చూస్తానన్నారు. రథసప్తమి వేడుకలు ఒక పండుగలా జరపాలని నిర్ణయించినట్టు తెలిపారు. చిట్టి వెంకటరావు అధ్యక్షత వహించారు. ఇప్పిలి శంకర్ శర్మ, సురంగి మోహన్‌రావు, నల్లి ధర్మారావు, పీఎంజే బాబు, పొట్నూరు వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

అర్జీలపై దృష్టి సారించాలి: కలెక్టర్



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

గుజరాతీపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అర్జీలపై అధికారులు దృష్టి సారించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. సోమవారం శ్రీకాకుళంలోని జడ్పీ సమావేశ మందిరంలో ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదికలో జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో అర్జీలను స్వీకరించారు. 71 అర్జీలు స్వీకరించగా ఇందులో 28 రెవెన్యూపరమైన సమస్యలే ఉండడం విశేషం. కాగా అర్జీలను అధికారులు సత్వరం పరిష్కరించి డిస్పోజ్ చేయాలని కలెక్టర్ కోరారు. కార్యక్రమంలో ఉప కలెక్టర్ అప్పారావు, జడ్పీ సీఈవో ఎల్ఎస్‌వీ శ్రీధర్ రాజ పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి: ఎస్ఐ

ఎచ్చెర్ల, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎచ్చెర్ల ఎస్ఐ వి.సందీప్‌కుమార్ తెలిపారు. సోమవారం ముద్దాడ జడ్పీఉన్నత పాఠశాల ఆవరణలో సంకల్పం పేరిట నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చెడువ్యసనాల వల్ల జీవితాలు పాడవుతాయని తెలిపారు. విద్యార్థిదశ చాలా కీలకమైందని, క్రమశిక్షణతో చదువుకుని లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అప్రెంటీస్‌తో ఉద్యోగావకాశాలు: ప్రిన్సిపాల్

ఎచ్చెర్ల, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి):ఐటీఐ ఉత్తీర్ణులైన అభ్యర్థులు అప్రెంటీస్ పూర్తి చేస్తే ఉద్యోగావకాశాలు మెరుగుపడతాయని జిల్లా అడ్మిషన్ల కన్వీనర్, ఐటీఐ ప్రిన్సిపాల్ ఎల్.సుధాకరరావు చెప్పారు. సోమవారం ఎచ్చెర్లలోని ప్రభుత్వఐటీఐలోప్రధాన మంత్రి జాతీయ అప్రెంటీస్ మేళా నిర్వహించారు. ఈసందర్భంగా 112 మంది అభ్యర్థులు హాజరుకాగా, 38 మందిని వివిధకంపెనీల్లో అప్రంటీస్‌కు ఎంపికచేశారు. కార్యక్రమంలో ఐఎంసీ ఛైర్మన్ ఎంవీఆర్ మూర్తి, జూనియర్ ఎంప్లాయిమెంట్ అధికారి శ్రీనివాసరావు, వివిధ కంపెనీల హెచ్‌ఆర్‌లు రామారావు, శ్రీనివాసరావు, వంశీ, ఐటీఐ ట్రైనింగ్ ఆఫీసర్లు వి.రఘురాం, బీవీసీ కామేశ్వరరావు, పి.విద్యాసాగర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

ఆముదాలవలస(సరుబుజ్జిలి) డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బి.వెంకటరమణ తెలిపారు. సోమవారం సరుబుజ్జిలి మండలంలోని మునగవలసలో ఏఐసీసీ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ జన్మదినవేడుకలు నిర్వహించారు.కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జి.దాలయ్య, జి.అప్పారావు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

గుజరాతీపేట, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ, ఇంజినీరింగ్, పీజీ చదువుతున్న విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన డబ్బులు విడుదలచేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ రవి కోరారు. ఈ మేరకు జడ్పీ కార్యాలయంలో సీఈవోకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థుల రీయింబర్స్‌మెంట్ రూ.2100 కోట్లు, వసతిదీవెన రూ.1400 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. గతఏడాది నాలుగు క్వార్టర్లకు గాను ఒక్క క్వార్టర్ మాత్రమే డబ్బులు జమచేశారని తెలిపారు. కోర్సులు పూర్తిచేసుకున్న విద్యార్థులకు ఆయా యాజమన్యాలు ఫీజు చెల్లిస్తేనే సర్టిఫికేట్లు ఇస్తున్నాయని, లేకపోతే విద్యార్థులకు ఇబ్బందులకు గురిచేస్తున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు దుర్గాప్రసాద్, చంద్రశేఖర్, పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులతో భూసమస్యల పరిష్కారం

ఇచ్ఛాపురం,డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి):రెవెన్యూసదస్సులతో భూసమస్యలు పరిష్కరించుకోవచ్చని తహసీల్దార్ ఎన్.వెంకటరావు తెలిపారు. సోమవారం మునిసిపాలిటీ పరిధిలోగల ఏఎస్‌పేట(బోర్డర్)ని మూడోవార్డులో జరిగిన రెవెన్యూ సదస్సులో భూములకు సంబంధించి 27 దరఖాస్తులు అందాయి. కార్యక్రమంలో రీసర్వే డీటీ కిరణ్, ఆర్ఐ కృష్ణ, వార్డు కౌన్సిలర్ పత్రి తవిటయ్య, సాలిన ఢిల్లీ పాల్గొన్నారు.

● లావేరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రైతు సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను ఏర్పాటుచేస్తోందని తహసీల్దార్ వై.జోగారావు తెలిపారు. సోమవారం బెజ్జిపురంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల నుంచి భూసమస్యలకు సంబంధించి వినతులను స్వీకరించారు. కార్యక్రమంలో రీసర్వే డీటీ తిరుపతిరావు, గ్రామ టీడీపీ అధ్యక్షులు వడ్డిపల్లి శ్రీనివాసరావు, దన్నాన శ్రీనివాసరావు, ఇజ్జాడ అప్పారావు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలు: ఏపీఎం

ఇచ్ఛాపురం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు అనేక అనర్థాలకు దారితీస్తున్నాయని, వీటికిదూరంగా ఉండాలని ఏపీఎం ఎస్.ప్రసాద్ కోరారు. సోమవారం ఇచ్ఛాపురంలో స్వయం సహాయక సంఘాల సభ్యులతో ర్యాలీ నిర్వహించి, బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు.ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ గ్రామస్థాయిలో సమావేశాలు నిర్వహించి బాల్య వివాహాలపై జరిగే అనర్థాల గురించి అవగాహన కల్పించాలని సూచించారు.

మండపల్లిలో క్షుద్రపూజల కలకలం

ఇచ్ఛాపురం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండపల్లిలో గుర్తుతెలియని వ్యక్తులు క్షుద్రపూజలు నిర్వహించడంతో కలకలం నెలకొంది. ఆదివారం అర్ధరాత్రి ఓ ఇంటి ముందురోడ్డుపై ముగ్గువేసి చుట్టూ నిమ్మకాయలు, కోడిగుడ్లు పెట్టడంతో సోమవారం గ్రామస్థులు భయాందోళన చెందారు.ఈగ్రామం ఒడిశా సమీపంలో ఉంది. సాధారణంగా అక్కడ ఎక్కువగా క్షుద్రపూజలు చేస్తుంటారు. అలా ఎవరైనా చేసి ఉంటారేమోనని గ్రామస్థులు భయాందోళన చెందుతున్నారు.

తేమ ఉన్నా ధాన్యం కొనుగోలు : ఎమ్మెల్యే రవికుమార్



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రవికుమార్

పొందూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తేమ ఉన్నా ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వం ఆదేశించిందని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ తెలిపారు. సోమవారం మండలంలోని గోరింట గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. వైసీపీ ప్రభుత్వంలో ధాన్యం కొనుగోలులో ఆ పార్టీ నాయకుల చేతివాటం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆరోపించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్ రామానుజులు, వ్యవసాయశాఖ ఏడీ శ్రీనివాసరావు,సర్పంచ్ సీహెచ్ శ్రీలక్ష్మి, టీడీపీ మండలాధ్యక్షుడు సీహెచ్ రామ్మోహన్, కూన సత్యనారాయణ, వాసుదేవరావు, అన్నెపు రాము,సీపాన శ్రీరంగనాయకులు, బలగ శంకరభాస్కర్, నాగేశ్వరరావు, వేణు గోపాలరావు పాల్గొన్నారు.

●రీసర్వేపేరుతో వైసీపీ నాయకులు భూఆక్రమణలకు పాల్పడ్డారని, వీటిని వెలికితీసేందుకే కూటమి ప్రభుత్వం ప్రతి గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని ఎమ్మెల్యే రవికుమార్ తెలిపారు.గోరింటలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ రీసర్వే పేరుతో అమాయకుల భూములను ఆక్రమించుకున్నారని ఆరోపించారు.

సాగు నీటి సమస్య లేకుండా చర్యలు: ఎమ్మెల్యే శంకర్

శ్రీకాకుళం రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రైతులకు సాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. సోమవారం మండలంలోని టి.మన్నయ్యపేటలో చెరువు పనులకు ఎమ్మెల్యే శంకర్ శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో చెరువులను పట్టించుకోకపోవడంతో రైతులు పూర్తిగా దీనవస్థలోకి చేరిపోయారని ఆరోపించారు.

● శ్రీకాకుళం స్పోర్ట్స్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): సౌత్ వెస్ట్ ఇంటర్ యూనివర్శిటీ పోటీల్లో బంగారు పతకాన్ని సొంతం చేసుకున్న బోరవెల్లి గ్రామానికి చెందిన దోబ యామశ్రీని, ఎస్‌జీఎఫ్ అండర్-19లో రజితాన్ని సాధించిన తాళాడు కావ్యను, కాంస్యాన్ని గెలుచుకున్న పట్నాన చంద్రశేఖర్‌ను ఎమ్మెల్యే గొండు శంకర్ అభినందించారు. ఈ మేరకు సోమవారం విశాఖ ఎ కాలనీలో ఎమ్మెల్యే కార్యాలయంలో కలిశారు.

రెవెన్యూ సమస్యలు పరిష్కరిస్తాం

గుజరాతీపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. శ్రీకాకుళం ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో ప్రత్యూషతోపాటు శ్రీకాకుళం, గార తహసీల్దార్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ల్యాండ్ బ్యాంకును గుర్తించి రానున్న రోజుల్లో నియోజకవర్గంలో పరిశ్రమలు, ఇనిస్టిట్యూషన్ల కోసం, పేదలకు ఇళ్లు అందించేందుకు వినియోగిస్తామని తెలిపారు.

'మీకోసం'లో 64 వినతులు



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఏఎస్పీ కేవీ రమణ

శ్రీకాకుళం క్రైం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని,సమస్యల పరిష్కారంలో జాప్యం తగదని జిల్లా పోలీసు అధికారులకు జిల్లా అదనపు ఎస్పీ కేవీ రమణ ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల వేదిక మీకోసంలో 64 వినతులు వచ్చాయి. ఈ సందర్భంగా ఏఎస్పీ కేవీ రమణ అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ప్రజా ఫిర్యాదులకు జిల్లా పోలీసుయంత్రాంగం అత్యంత ప్రాధాన్యతనివ్వాలని, ఫిర్యాదుదారుల సమస్యలను తెలుసుకుని బాధితులకు న్యాయం చేయాలని జూమ్ మీటింగ్‌లో ఏఎస్పీ రమణ సూచించారు.

బయో టెక్నాలజీతో బహుళ ప్రయోజనాలు

● మానిటోబా యూనివర్సిటీ ప్రొఫెసర్ చెలికాని ప్రసేన్



మాట్లాడుతున్న చెలికాని ప్రసేన్

ఎచ్చెర్ల, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): శాస్త్ర, వైద్య, పర్యావరణ, వ్యవసాయ తదితర రంగాలకు బయోటెక్నాలజీ అధ్యయనాలు బహుళ ప్రయోజనకరమని మానిటోబా యూనివర్సిటీ (కెనడా) హెల్త్ సైన్స్ విభాగం అధ్యాపకులు ప్రొఫెసర్ చెలికాని ప్రసేన్ తెలిపారు. సోమవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో బయోటెక్నాలజీ విభాగంఆధ్వర్యంలో ఆవిష్కరణలు, వైద్య శాస్త్రం, ప్రపంచ ఆరోగ్యంలో పరిణామాలుఅన్న అంశంపై అంతర్జాతీయ వర్క్‌షాపు నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ సాంకేతిక ప్రగతితో, బయోసైన్స్ పరిశోధనలు కొత్త పుంతలు తొక్కుతున్నాయని చెప్పారు. వర్చువల్ మోడ్‌లో అలబామా యూనివర్సిటీ (అమెరికా) హేమటాలజీ, అంకాలజీ విభాగం అధ్యాపకులు డాక్టర్ జి.పూర్ణచంద్రనాగరాజు మాట్లాడుతూ జెనిటిక్, ఇంజనీరింగ్ ద్వారా రీకాంబినేషన్ డీఎన్ఏ, జీన్ క్లోనింగ్, జీన్ ట్రాన్స్ఫర్ అంశాల్లో అధ్యయనాలు అధికమయ్యాయని తెలిపారు. బీఆర్ఏయూ వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని మాట్లాడుతూ జన్యు సంబంధిత వ్యాధులు చేధించడానికి మరిన్ని మెరుగైన పరిశోధనలు జరగాల్సి ఉందన్నారు. కార్యక్రమ కన్వీనర్, వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.సుజాత అధ్యక్షతనజరిగిన సదస్సులో డీఎంహెచ్‌వో బి.మీనాక్షి, ఏయూ బయోటెక్నాలజీ విభాగం అధ్యాపకులు ప్రొఫెసర్ పీఎస్‌పీ ధనుంజయ, వర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ బి.అడ్డయ్య, వర్సిటీ ప్రిన్సిపాల్స్ ఎస్.ఉదయభాస్కర్, ఎం.అనూరాధ, సీహెచ్.రాజశేఖరరావు పాల్గొన్నారు.

పెద్దల సభకు కృష్ణయ్య ఎంపికపై హర్షం

● బీజేపీకి ధన్యవాదాలు తెలియజేసిన బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధానకార్యదర్శి



ఆర్.కృష్ణయ్యతో రాజేష్

శ్రీకాకుళంఅర్బన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): వివిధ రాష్ట్రాలకు సంబంధించి బీజేపీ అధిష్ఠానం ప్రకటించిన రాజ్యసభ అభ్యర్థుల జాబితాలో ఆంధ్రప్రదేశ్ నుంచి బీసీ సంఘ నాయకుడు ఆర్.కృష్ణయ్య పేరును ప్రకటించడంపై బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బుడుమూరు రాజేష్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.ఈ మేరకు బీజేపీకి ధన్యవాదాలు తెలిపారు. కృష్ణయ్య ఎంపిక బీసీలపై బీజేపీకి గౌరవంగా ఉందని భావిస్తున్నామని పేర్కొన్నారు. బీసీలకు ప్రత్యేకంగా మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని కోరారు. బీసీలకు చట్ట సభల్లో యాభై శాతం రిజర్వేషన్ కల్పించాలని తెలిపారు.

జనవరి 11,12 తేదీల్లో 'వికసిత్ భారత్ యంగ్ లీడర్స్'

గుజరాతీపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర యువజనుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ కార్యక్రమాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని సెట్‌శ్రీ సీఈవో బీవీ ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 11,12వ తేదీల్లో ఢిల్లీలో భారత్ మండపంలో జాతీయస్థాయి యువజనోత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 15, నుంచి 29 ఏళ్లలోపు యువతకు క్విజ్, వ్యాసరచనలో పాల్గొనడానికి, దేశ భవిష్యత్ కోసం విజన్ డక్‌ను అభివృద్ధి చేయడానికి అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తిగల యువత ఆన్‌లైన్ లింక్ ద్వారా పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

పాలిటెక్నిక్‌లో ఏసీ రిపేర్ కోర్సు

గుజరాతీపేట, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి):ఆమదాలవలస ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏసీ టెక్నీషియన్ రిపేర్ కోర్సును నిరుద్యోగ యువత కోసం నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి సాయికుమార్ తెలిపారు. పదో తరగతి నుంచి డిగ్రీ, బీటెక్ చదివి ఉండి, 18 నుంచి 30 ఏళ్ల వయస్సు గల వారు ఈ కోర్సులో చేరడానికి అర్హులని పేర్కొన్నారు. ఆసక్తిగల వారు కోఆర్డినేటర్ సత్యసాయి వెంకటేష్ 7569077449 నెంబరుకు ఫోన్ ద్వారా పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

ఎయిడ్స్‌పై అవగాహన కల్పించడం బాధ్యత

పొందూరు, డిసెంబరు9:ఎయిడ్స్ అదుపు చేయాలంటే ప్రతిఒక్కరికి అవగాహన ఉండాలని పొందూరు సామాజిక ఆసుపత్రి సూపరింటెండెంట్ పి.సుజాత తెలిపారు. సోమవారం పొందూరులో ఎయిడ్స్ నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఎయిడ్స్‌పై అవగాహన కల్పించడం సామాజిక బాధ్యతఅని తెలిపారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది, ఐసీటీసీ కౌన్సిలర్ నాగవల్లి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ఇచ్ఛాపురం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురంలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో మానవ హక్కుల దినోత్సవం పురస్కరించుకొని నియోజకవర్గ నేషనల్ ఫెడరేషన్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ అధ్యక్షుడు దక్కత కృష్ణమూర్తిరెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా యువత మాదక ద్రవ్యాలు దుర్వినియోగం పరిణామాలు, మానవ హక్కుల పరిరక్షణ, సైబర్‌నేరాలపై వివిధ విభాగాల్లో పోటీలు జరిగాయి. కార్యక్రమంలో సభ్యులు కేసీ పూరి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాబిన్‌కుమార్ పాడి, రాజేంద్రప్రసాద్, రామారావు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి : ఏవో

ఇచ్ఛాపురం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ఈనెల 11, 12 తేదీల్లో వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏవో టి.భార్గవి ఒక ప్రకటనలో తెలిపారు. కోసిన పంటను కుప్పలుగా వేసి భద్రపరచుకోవాలని కోరారు.

ఎనిమిది పశువుల స్వాధీనం

లావేరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలం బోరపేట వద్దగల జాతీయరహదారిపైబుడుమూరు సంత నుంచి రణస్థలం వైపు వ్యాన్‌తో తరలిస్తున్న ఎనిమిది పశువులను సోమవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పశువులను తరలిస్తున్న విజయనగరం జిల్లా గుర్ల మండలంలోని గుజ్జింగివలసకు చెందిన గురునాథ్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

దుప్పట్ల పంపిణీ

కంచిలి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని మండపల్లిలో గల సీతయ్య ఫౌండేషన్‌లో ఉన్న 30 మంది అనాథలకు కొర్లాం జాగృతి స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు రాంబుడ్డి గణపతి దుప్పట్లు సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో రత్నాల శ్రీనివాసరావు, జి.మోహన్, రమేష్ పాల్గొన్నారు.

మూసివేసిన పరిశ్రమలే లక్ష్యం

- పట్టుబడిన కాపర్ దొంగలు
- 27 లక్షల విలువైన 770 కేజీల కాపర్ స్వాధీనం

శ్రీకాకుళం క్రైం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మూసివేసిన పరిశ్రమలే లక్ష్యంగా అందులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి కాపర్‌ను దొంగిలించి వాటిని అమ్ముకుని సొమ్ము చేసుకునే దొంగల ముఠాను అరెస్టు చేసినట్టు శ్రీకాకుళం డీఎస్పీ సీహెచ్ వివేకానంద తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. డీఎస్పీ కథనం మేరకు.. కొమరవాని పేటకు చెందిన కొమర తారకేశ్వరరావుతోపాటు విశాఖపట్నంలోని గాజువాక, గంట్యాడకు చెందిన కదిరి హరీష్, గడ్డపాటి తిలక్, చెన్ను చంటి కలిసి ట్రైమాక్స్‌లో రూ.26లక్షల విలువైన కాపర్‌తో పాటు సరుబుజ్జిలి, బొబ్బిలి పోలీసు స్టేషన్ పరిధిలో లక్ష రూపాయల విలువైన ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి కాపర్ చోరీ చేశారు. వాటిని గాజువాకలోని పైలా ప్రకాష్‌కు చెందిన స్క్రాప్ షాప్‌లో విక్రయించారు. ట్రైమాక్స్‌లోని కాపర్ ప్లేట్లు, కేబుల్స్‌ను కారులో నాలుగు సార్లు తరలించారు. ఈ చోరీపై గార పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు అందడంతో శ్రీకాకుళం సీఐ కె.పైడపు నాయుడు, ఎస్ఐ ఆర్.జనార్దనరావు, సీసీఎస్ సిబ్బందితో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి దర్యాప్తు చేశారు. ఈ మేరకు గార పోలీసు స్టేషన్ పరిధిలోని ట్రైమాక్స్‌తో పాటు సరుబుజ్జిలి, బొబ్బిలిలో రూ.27 లక్షల విలువైన కాపర్ ప్లేట్స్, ట్రాన్స్‌ఫార్మర్స్‌లోని కాపర్ కేబుల్స్‌ను చోరీ చేసిన నలుగురిని అరెస్టు చేశారు. వారు తోటలో దాచి ఉంచిన కాపర్‌తో సహా దొంగిలించిన 772 కేజీల కాపర్ కేబుల్స్‌ప్లేట్లు స్వాధీనం చేసుకున్నారు. చోరీ చేసిన కాపర్‌ను కొను గోలు చేసిన షాపు నిర్వాహకుడు పైల ప్రకాష్ పరారీలో ఉన్నాడు. పోలీసుల అదుపులో ఉన్న నలుగురు పాత నేరస్థులపై గార, సరుబుజ్జిలి, బొబ్బిలిలో కేసులు ఉన్నాయి. ఈ కేసును చేధించిన సీఐ కె.పైడపునాయుడు, గార ఎస్ఐ ఆర్.జనార్దనరావులను డీఎస్పీ అభినందించారు. వీరికి ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి రివార్డులు అందించారు. సమావేశంలో సిబ్బంది పాల్గొన్నారు.

హత్య కేసు ఛేదించిన పోలీసులు

- భూవివాదమే కారణమని దర్యాప్తులో గుర్తింపు
- శ్రీకూర్మం హత్య కేసులో ఎనిమిది మంది అరెస్టు
- డీఎస్పీ వివేకానంద


సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ సీహెచ్ వివేకానంద

శ్రీకాకుళంక్రైం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): శ్రీకూర్మంలో ఈనెల ఆరోతేదీన జరిగిన హత్య కేసును పోలీసులు ఛేధించారు. ఈ హత్యకు భూవివాదమే కారణమని దర్యాప్తులో గుర్తించారు. సోమవారం తన కార్యాలయంలో డీఎస్పీ సీహెచ్ వివేకానంద శ్రీకాకుళం సీఐ కె.పైడపునాయుడు, గార ఎస్ఐ ఆర్.జనార్దనరావుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. డీఎస్పీ కథనం మేరకు.. శ్రీకూర్మంలో ఉప్పాడ రాములమ్మకు చెందిన 1.40 ఎకరాల భూమిని ఉప్పాడ రాజేష్ సహ కారంతో ఉప్పాడ సూర్యనారాయణ, చుక్కా రాము, అనపాన షణ్ముఖరావులు కొను గోలు చేసేందుకు ఎగ్రిమెంట్ చేసుకున్నారు. దీంతో తమ ఆధీనంలో ఉన్న భూమిని కొనుగోలు చేశారన్న కక్షతో కొయ్యా భాస్కరరావు, కొయ్య రమేష్, కొయ్య లోకేష్, కొయ్య గురయ్య, కొయ్య సాయికిరణ్, గుజ్జు లక్ష్మణ, గుజ్జు రామారావు, గుజ్జు శ్రీనులు పథకం ప్రకారం దాడిచేశారు. కత్తులు, గొడ్డళ్లు, కర్రలతో విచక్షణారహితంగా దాడి చేయడంతో రాజేష్ మృతి చెందాడు.చుక్క రాముతోపాటు సరోజనీకి గాయాలయ్యాయి. తీవ్రగాయాలపాలైన రాము కేజీహెచ్‌లో చికిత్స పొందుతు న్నాడు. దాడి నుంచి ఉప్పాడ సూర్యనారాయణ త్రుటిలో తప్పించుకుని పారి పోయాడు. రామును కాపాడడానికి వచ్చిన ఆయన భార్య సరోజనిపై కూడా దాడి చేయడంతో ఆమెకు స్వల్పగాయాలయ్యాయి. 2018లో భూవివాదం నేపథ్యంలో సూర్యనారాయణపై కొయ్యా భాస్కరరావు కుటుంబ సభ్యులు దాడి చేయగా అప్పట్లో న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. రాములమ్మ నుంచి సూర్యనారాయణ భూమి కొనుగోలు చేయడంలో రాజేష్ కీలకంగా వ్యవహరించడంతోనే ఈ హత్య జరిగింది. రాజేష్ అడ్డుతొలగించాలని పథకంతోనే దాడి చేసి చంపేశారు. ఈ మేరకు దాడికి పాల్పడిన ఎనిమిది మందిని అరెస్టు చేశారు. వారు వినియోగించిన మారణాయుధాలను స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరుపరిచారు. ఈ ఎనిమిది మందిపై రౌడీషీట్ తెరిచారు.

క్రైం కార్నర్

శబరిమలై వెళ్లి తిరిగి వస్తూ..

- తిరుపతిలో చిన్నహరిశ్చంద్రపురం వాసి మృతి


సత్యనారాయణ (ఫైల్)

కోటబొమ్మాళి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): హరిశ్చంద్రపురం పంచాయతీ చిన్న హరిశ్చంద్రపురానికి చెందిన పిడుగు సత్యనారాయణ (63) తిరుపతిలో గుండెపోటుకు గురై మృతి చెందారు. గ్రామంలోని అయ్యప్ప సన్నిధానం స్వాములతో కలిసి ఈనెల 4న సత్యనారాయణ అయ్యప్ప దర్శనానికి శబరమలై వెళ్లి తిరుగు ప్రయాణంలో తిరుపతి వచ్చి అస్వస్థతకు గురయ్యారు. వెంటనే అతనితో ఉన్న స్వాములు తిరుపతిలో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారు జామున మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతు డు చిన్నహరిశ్చంద్రపురంలో టైలర్‌గా ఉంటూ పోలాకి మండలం రేగుపాడులోని శివాలయంలో అర్చకత్వం చేస్తున్నారు. ఈయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు హైదరాబాద్‌లో సీఐఎస్‌ఎఫ్‌గా పని చేస్తున్న కుమారుడు జీవన్‌కుమార్ తండ్రి అనారోగ్యానికి గురైన విషయం తెలుసు కుని విమానంలో తిరుపతి చేరుకున్నాడు. మంచి వ్యక్తిగా పేరు ఉన్న సత్యనారా యణ మృతి చెందిన విషయం తెలుసుకుని రేగులపాడు, చిన్నహరిశ్చంద్రపురం గ్రామాల్లో విషాదఛాయలు అలముకున్నాయి.

గుర్తుతెలియని మృతదేహం



టెక్కలి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తుతెలియని మృతదేహం ఉందని, ఈయన వివరాలు తెలిస్తే పోలీసులకు తెలియజేయాలని సీఐ ఎ.విజయ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. వయసు 50 నుంచి 60 ఏళ్ల మధ్య ఉంటుందని, ఎవరైనా గుర్తిస్తే 63099 90860కు తెలియజేయాలని ఆయన కోరారు.

వ్యాన్ ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు

లావేరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బెజ్జిపురం వద్ద గల జాతీయ రహదారిపై సోమవారం వ్యాన్ ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో విజయనగరం జిల్లా చినదడిపిల్లికి చెందిన కుప్పిలి విక్రమ్‌సాయికి తీవ్రగాయాలయ్యాయి. ఎస్ఐ లక్ష్మణరావు కథనం మేరకు.. విక్రమ్ సాయి బుడుమూరు నుంచి రణస్థలం వైపు సర్వీస్ రోడ్డులో ద్విచక్రవాహనంపై వస్తున్నాడు. ఆ సమయంలో ఎదురుగా వస్తున్న వ్యాన్ ఢీకొంది. దీంతో గాయ పడిన విక్రమ్‌సాయికి 108 వాహనంతో చికిత్స నిమిత్తంగా శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదుచేశారు.

కొత్తరోడ్డులో ఇసుక లారీ సీజ్

ఆమదాలవలస, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఇసుకను అక్రమంగా తరలిస్తున్న లారీని సీజ్ చేసినట్లు ఎస్ఐ కె.వెంకటేష్ తెలిపారు. ఆదివారం రాత్రి నాగావళి నదిలో అక్రమ తవ్వకాలు జరిపి లారీ ద్వారా ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం అందినట్లు చెప్పారు. ఈ మేరకు అర్ధరాత్రి రెండు గంటలకు కొత్తరోడ్డు సమీపంలో ఇసుక లారీని ఎస్ఐ వెంకటేష్ ఆపగా ఎటువంటి పత్రాలు లేకపోవడంతో సీజ్ చేశారు. లారీని గనుల శాఖ అధికారులకు అప్పగించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

రణస్థలం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక జాతీయ రహదారిపై సోమవారం పాతపెట్రోల్ బంకు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మండల కేంద్రానికి చెందిన టి.పాటయ్య (67) మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. పాత పెట్రోల్ బంకు వద్ద పాటయ్య తన ద్విచక్రవాహనానికి పెట్రోల్ కొట్టించి రోడ్డు క్రాస్ చేస్తున్న సమయంలో శ్రీకాకుళం నుంచి ద్విచక్రవాహనంపై వస్తున్న మరో వ్యక్తి ఢీకొన్నాడు. దీంతో పాటయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. పాటయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. జేఆర్‌పురం ఎస్ఐ ఎస్. చిరంజీవి కేసునమోదు చేశారు.

ఆదర్శనీయుడు చెన్నుపాటి లక్ష్మయ్య

టెక్కలి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఉద్యమ పితామహుడు చెన్నుపాటి లక్ష్మయ్యను ఆదర్శంగా తీసుకోవాలని హెచ్ఎం ఎం.అనూరాధ అన్నారు. చాకిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో లక్ష్మ య్య వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆమె మాట్లాడుతూ.. ఉపాధ్యాయ సంఘం పెట్టుకోవడానికి అవకాశం లేని రోజుల్లో సంఘాన్ని నిర్మించిన ఘనత చెన్నుపాటి లక్ష్మయ్యకే దక్కుతుందన్నారు. ఆయన అడుగుజాడల్లో ఉద్యమించి ఉపాధ్యాయ సమస్యల సాధనకు తోడ్పడాలన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు కె.దాలయ్య, పి.జగదీశ్వరరావు, వైకుంఠరావు, రుషి పాల్గొన్నారు.

పాస్టర్స్ ఫెలోషిప్ వేడుకలు


ఫెలోషిప్ వేడుకల్లో పాల్గొన్న పాస్టర్లు

నరసన్నపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక కల్వరి బాపిస్టు చర్చిలో సోమవారం నియోజకవర్గ స్థాయి పాస్టర్స్ ఫెలోషిప్ వేడుకలు నిర్వహించారు. ముందస్తు క్రిస్మస్ వేడుకల్లో భాగంగా పాస్టర్ల కుటుంబ సభ్యులతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి కుమారుడు బగ్గు సునీల్, టీడీపీ రాష్ట్ర క్రిస్టియన్ సెల్ జనరల్ సెక్రటరీ బోసుబాబు, పాస్టర్స్ ఫెలోషిప్ జిల్లా అధ్యక్షుడు పి.కృపానందం, జాన్ డేవిడ్ పాల్గొన్నారు.

ఘనంగా గ్రాండ్ క్రిస్మస్ వేడుక


ఆరాధనా గీతాలను ఆలపిస్తున్న దృశ్యం

పాతపట్నం డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక యెరుకోల గ్రౌండ్స్‌లో గ్రాండ్ క్రిస్మస్ వేడుకను నిర్వహించారు. ప్రముఖ ప్రసంగీకులు డబ్ల్యూసీఎం కిరణ్ పాల్ ఏసు వాక్యాలను వివరించారు. యువతీయువకులు ఆరాధనా గీతాలు ఆలపించారు. కొత్తూరు, మెళియాపుట్టి, హిరమండలం, పాతపట్నం, టెక్కలి, పర్లాకిమిడి నుంచి క్రైస్తవులు పాల్గొన్నారు.

హరిపురంలో పది రోజులుగా కరెంటు కష్టాలు

హరిపురం, డిసెంబరు9 (ఆంధ్రజ్యోతి): హరిపురంలో గత పదిరోజులుగా కరెంటు కష్టాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతి రోజు అనేక పర్యాయాలు కరెంటు పోతుండడంతో వాణిజ్య, వ్యాపార దుకాణాలు, రైస్‌మిల్లులు, జీడి పరిశ్రమలకు ఇబ్బంది కలుగుతోంది. హరిపురంలో ఎల్ఐ (లైన్ ఇనస్పెక్టర్), ఎస్ఎల్ఎం (సీనియర్ లైన్‌మెన్) ఉన్నా కీలకంగా ఉండాల్సిన జేఎల్ఎం, ఏఎల్ఎం నాలుగు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో ఎటువంటి సమస్య వచ్చినా తక్షణం స్పందించడలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో ప్రైవేటు వ్యక్తులను ఆశ్రయించాల్సి వస్తోందని పలువురు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకో వాలని పలువురు స్థానికులు కోరుతున్నారు.

బస్సు మొరాయించి ఇబ్బందులు



మందస,డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పలాస ఆర్టీసీ డిపోకి చెందిన పల్లెవెలుగు బస్సు సోమవారం మందసలో మొరాయించింది. మందస నుంచి బుడార్సింగి బయలుదేరిన బస్సు మొరాయించి రోడ్డు మధ్యలో నిలిచిపోవడంతో ఇటు ప్రయాణికులు, అటు వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రయాణికులే బస్సును తోస్తూ ముందుకు నడిపించిన తరువాత బస్సు కదిలింది. కాలం చెల్లిన బస్సులు నడుపుతుండడంతో ఇటువంటి పరిస్థితి ఎదురవుతోందని ప్రయాణికులు వాపోతున్నారు.

గద్దర్ జాతీయ సేవా పురస్కారానికి యోగి ఎంపిక



టెక్కలి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రజా యుద్ధ నౌక గద్దర్ జాతీయ సేవా పురస్కారానికి ఆది వాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర నాయకుడు వాబ యోగి ఎంపికైనట్లు అవార్డు కమిటీ సభ్యుడు ఎ.ఉదయ్‌భాస్కర్ నుంచి లేఖ వచ్చింది. ఈ మేరకు ఈనెల 12న కోనసీమ జిల్లా పి.గన్నవరంలో తెలంగాణా సాంస్కృతిక వారధి ఛైర్మన్ డాక్టర్ వెన్నెల గద్దర్ ఈ అవార్డును ప్రదానం చేస్తారని ఆయన తెలిపారు. పాలకులు ఎవరైనా గిరిజన సమస్యలపై నిరంతరం ఉద్యమాలు చేస్తున్న యోగికి ఈ అవార్డు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా యోగిని పలు ప్రజా సంఘాల నాయకులు అభినందించారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

పలాస, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కుప్పిలి నర్సింహమూర్తి కోరారు. సంకల్ప్-2025లో భాగంగా విద్యార్థులు-తల్లిదండ్రులతో సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల అభ్యున్నతికి అధ్యాపకులు కృషి చేస్తున్నారని, ఇంటి వద్ద తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏజీఎంసీ బి.వెంకట మోహన్ పాల్గొన్నారు.

ఉపాధి పనులపై గ్రామసభలు

పోలాకి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గత ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన ఉపాధి హామీ పనులపై ఆడిట్ నిర్వహించి పనులను పరిశీలించడం జరిగిందని డీఆర్పీ కె.మేనక తెలిపారు. సోమవారం గాతలవలసలో ఉపాధి పనులపై సచివాలయ ప్రాంగణంలో గ్రామసభ నిర్వహించారు. సర్పంచ్ మెండ శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సభలో ఎంపీటీసీ వై.లక్ష్మణరావు, సాంకేతికసలహాదారు ఆర్.పద్మావతి, క్షేత్రసహాయకులు నేటింటి నరసింహులు, కంఠయ్య, గ్రామపెద్దలు పాల్గొన్నారు. దీర్ఘాశి సచివాలయంలో సర్పంచ్ మెండకృష్ణసుమంగళి అధ్యక్షతన ఉపాధి ఆడిట్ పనుల పరిశీలన అనంతరం సోమవారం సాయంత్రం గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పాగోటీనీరజ, కార్యదర్శి జగదీష్ పాల్గొన్నారు.

ఘనంగా నవ చండీయాగం

కోటబొమ్మాళి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సుబ్బారావుపేట శ్రీవిజయ వెంకటేశ్వస్వామి దేవాలయంలో నవచండీ మహాయాగం ఘనంగా నిర్వహిస్తున్నారు. సుసరాపు చంద్రశేఖర శర్మ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యాగంలో సోమవారం 50 మంది దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచి విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, రక్షాసూత్ర పూజ, గోపూజ, మండపావాహన చేపట్టారు. వేద పండితులు ఆరవెల్లి విశ్వనాథశర్మ, అర్చకులు శ్రీనిబాబు, రాజాబాబు పాల్గొన్నారు.

300 సారా ప్యాకెట్లు స్వాధీనం

ఇచ్ఛాపురం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఒడిశాలో ఆ రాష్ట్రానికి చెందిన లావణ్య దొలై 300 సారా ప్యాకెట్లను కొనుగోలు చేసి తరలిస్తుండగా పట్టుకొని స్వాధీనం చేసుకున్నామని ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ పి.దుర్గాప్రసాద్ తెలిపారు. సోమవారం గొర్లపాడు-తూటుపురం జంక్షన్ వద్ద తనిఖీ సమయంలో ద్విచక్ర వాహనంపై తరలిస్తుండగా స్వాధీనం చేసుకుని ఆమెను అరెస్టు చేశామని తెలిపారు.

30 మద్యం సీసాలు..

శ్రీకాకుళం అర్బన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రణస్థలం మండలంలోని పైడి భీమవరంలో అక్రమ మద్యం నిల్వలపై ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారులు దాడులు చేశారు. ఈ మేరకు 30 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఇప్పటి వరకు రణస్థలం పరిధిలో 31 కేసులు నమోదు చేసి.. 31 మందిని అరెస్ట్ చేశామని సీఐ ప్రకటనలో తెలిపారు.

మరిదిపై ఫిర్యాదు

పాతపట్నం డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కె.గోపాలపురం గ్రామంలో వీధి కొళాయి వద్ద సోమవారం చోటుచేసుకొన్న వాగ్వాదంలో తన మరిది మంగి రవి కర్రతో దాడిచేసి గాయపరిచినట్లు మంగి శ్రీదేవి ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ బి.లావణ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఒడిశా నుంచి కేరళ తరలిస్తుండగా..

- లొద్దపుట్టిలో 14.450 కేజీల గంజాయి స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న సీఐ చిన్నమనాయుడు

ఇచ్ఛాపురం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఒడిశాలో ఆ రాష్ట్రానికి చెందిన విద్యా సాగర్ సింగ్ కొనుగోలు చేసిన గంజాయిని కేరళకు రైలు మార్గం లో తరలించేందుకు సిద్ధమవుతుండగా లొద్దపుట్టిలో పట్టుబడ్డాడు. ఈ మేరకు ఆయన వద్ద 14.450 కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఇచ్ఛా పురం సర్కిల్ కార్యాలయంలో సీఐ మీసాల చిన్నమ నాయుడు రూరల్ ఎస్ఐ శ్రీనివాసరావుతో కలిసి విలేక రులతో మాట్లాడారు. సీఐ కథనం మేరకు.. ఒడిశాలోని గజపతి జిల్లా బీజాఘూర్ గ్రామం మోహన్ బ్లాక్‌కు చెందిన విద్యాసాగర్ సింగ్ కేరళ రాష్ట్రం ఎర్నాకులంలో కూలి పని చేస్తున్నాడు. అక్కడ గంజాయి వ్యాపారం చేసే షాహిల్‌ఖాన్‌తో పరి చయం ఏర్పడింది. ఆయనకు గంజాయి కావాల్సి వచ్చినప్పుడల్లా కేరళ నుంచి ఒడిశా లోని సింకులిపదర్‌లో ఉన్న అత్త వారింటికి వచ్చి అక్కడ గంజాయి విక్రయించే కుమార్ వద్ద కొనుగోలు చేసి షాహిల్ ఖాన్‌కు ఎక్కువ లాభానికి అమ్ముతుండేవాడు. ఈ క్రమంలో సోమవారం ఒడిశాలో కొనుగోలు చేసిన గంజాయిని బస్సులో తీసుకొచ్చి లొద్దపుట్టి హైవే వద్ద తుల సమ్మ ఆలయం సమీపంలోని ప్లైఓవరు బ్రిడ్జి కింద దిగాడు. అక్కడ అనుమానాస్పదంగా కనిపించడంతో రూరల్ ఎస్ఐ శ్రీనివాసరావు తనిఖీ చేపట్టారు. ఆయన వద్ద మూటల్లో ఉన్న 14 కేజీల 450 గ్రాముల గంజాయిని పట్టుకున్నారు. ఈ మేరకు విద్యా సాగర్ సింగ్‌ను అరెస్ట్ చేశారు.

కె.గోపాలపురం వద్ద 8 కేజీలు..


వివరాలు వెల్లడిస్తున్న సీఐ చిన్నమనాయుడు

పాతపట్నం డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): కె.గోపాలపురం వద్ద ఒడిశాకు చెందిన వ్యక్తి 8.132 కిలోల గంజాయి తరలిస్తూ సోమవారం మధ్యాహ్నం పట్టుబడినట్లు సీఐ వి.రామా రావు తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సోమవారం విలేకరులతో మాట్లాడుతూ వివరాలు వెల్లడించారు. ఆ వివరాలిలా ఉన్నాయి.. పాతపట్నం పంచాయతీ పరిధి కె.గోపాలపురం వద్ద ఒడిశా రాష్ట్ర గంజాం జిల్లా సురడ బ్లాక్ సాగిడి గ్రామానికి చెందిన సంజయ్‌బద రైతా.. జెనపోడ గ్రామానికి చెందిన మరోవ్యక్తితో నెల్లూరులో గంజాయిని అమ్మేందుకు సోమవారం జనపోడా గ్రామం నుండి బయలు దేరారు. రెండు బ్యాగులలో గంజాయిని ఉంచి బయలుదేరి ఒడిశాలోని పర్లాకిమిడిలో దిగారు. ఆ తరువాత రెండో వ్యక్తి పాతపట్నంలో కలుస్తానని చెప్పగా సంజయ్‌బద రైతా కాపుగోపాలపురం రోడ్ గుండా నడుచుకుంటూ వస్తూ పట్టుబడ్డాడు. ముందస్తుగా వచ్చిన సమాచారం మేరకు మాటువేసి ఉన్న పోలీసులు నిందితుడిని పట్టుకుని అతని వద్ద నుంచి 8.132కిలోల గంజాయి, ఒక సెల్‌ఫోన్, ఆధార్ కార్డు, రూ.500 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ బి.లావణ్య కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడిని పట్టుకోవడంలో క్రియాశీలకంగా వ్యవహ రించిన ఎస్ఐ లావణ్య, సిబ్బందిని ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి ప్రశంసించి అభినందించారని సీఐ తెలిపారు.

ఉద్దానాన్ని కాపాడుకునేందుకు మరో ఉద్యమం

- 12న గ్రామాల్లో వామపక్ష నేతల పర్యటన


మాట్లాడుతున్న వామపక్ష నాయకులు

కాశీబుగ్గ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉద్దానాన్ని కాపాడుకునేందుకు మరో ఉద్యమం తప్పదని వామపక్ష నాయకులు డి.గోవిందరావు, చాపర వేణు, మాధవరావు, సన్యాసిరావు, మోహనరావు అన్నారు. సోమవారం కాశీబుగ్గలో వారు విలేకరులతో మాట్లాడుతూ.. ఎయిర్ పోర్ట్ కోసం బలవంతపు భూ సేకరణకు వ్యతిరేకంగా ఈనెల 12న గ్రామాల్లో పర్యటించాలని నిర్ణయించామన్నారు. ఉద్దానం ప్రజలు వద్ద బలవంతపు భూసేకరణ ఆపాలని, కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సముద్ర తీర ప్రాంతాన్ని కార్పొరేట్లకు కట్టబెడితే సహించేది లేదని హెచ్చరించారు. జిల్లా సస్యశ్యామలం కావాలంటే వంశధార ప్రాజెక్టు నిర్మించి 50 ఏళ్లు కావస్తోందని, దీని ఆధునికీకరణకు రూ.1000 కోట్లు కేటాయించి శివారు భూములకు సాగునీరందిస్తే రెండు పంటలు పండి ప్రజల ఆదాయం పెరుగు తుందన్నారు. తద్వారా కొనుగోలు శక్తి పెరిగి అనుబంధ పరిశ్రమలు వస్తాయన్నారు. వంశధార ఆధునీకరణకు ఎందుకు నిధు లు కేటాయించలేదో తెలపాలని వారు డిమాండ్ చేశారు. జీడీ, కొబ్బరి పంటలకు గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు


పలాస: ఫిర్యాదులు స్వీకరిస్తున్న మునిసిపల్ కమిషనర్ రామారావు

పలాస, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జంట పట్టణల్లో తాగునీరు, పారిశుధ్య సమస్యలను తక్షణం పరిష్క రించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మునిసిపల్ కమిషనర్ నడిపేన రామారావు తెలిపారు. సోమవారం స్థానిక కార్యాలయం ఆవరణలో ప్రజాసమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. స్థానికులు పారిశుధ్య నిర్వహణ, తాగునీటి ఇబ్బందులపై ఫిర్యాదులు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాగునీరు లేని ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తామన్నారు. పవర్‌బోర్లు మరమతులు చేయించి నీరందిస్తామన్నారు. వివిధ సమస్యలపై 19 దరఖాస్తులు వచ్చినట్లు ఆయన తెలిపారు.

ధాన్యం విక్రయాల్లో ఇక్కట్లను తొలగించండి

పాతపట్నం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ధాన్యం విక్రయంలో రైతులు పడుతున్న ఇబ్బందులను పరిష్కరించాలని కె.గోపాలపురం గ్రామరైతు బడియాల అప్పల నాయుడు కోరారు. ఈ మేరకు సోమవారం 'మీకోసం'లో తహసీల్దార్ ఎస్.కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. ధాన్యం విక్రయానికి గోనె సంచులు సరఫరా చేయడం లేదని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ధాన్యం కోత కమిషన్ ధర నియంత్రణ లేదన్నారు. క్షేత్రస్థాయిలో రైతులు పడుతున్న ఇబ్బందులను తొలగించాలని కోరారు.

గిరిజన సమస్యలు పరిష్కరించాలి


నిరసన తెలుపుతున్న గిరిజనులు

హిరమండలం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గిరిజన గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. మర్రిగూడ పంచాయతీ పరిధిలోని జీలకర్రగూడ, దాసుమానుగూడ, పుట్టిగాం, బంగారుగూడ, కిరిడివలస, అంతిలి, కూర్మవలస, బొండు గూడ తదితర గ్రామాల్లో పలు సమస్యలను పరిష్కరిం చాలన్నారు. భూ సమస్యలు, విద్యుత్, తాగునీరు, రహదారి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి పి.తేజేశ్వరరావు, గిరిజన సంఘం నాయకులు కుమ్మిరిక రమేష్, మర్రిపాడు సర్పంచ్ ఊయక సురేష్, పాలక భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ఐటీడీఏ మంజూరు చేయాలి

మందస, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మందసకి ఐటీడీఏ మంజూరు చేయాలని ఆదివాసీ గిరిజన నాయ కులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహిం చారు. గిరిజన గ్రామాలకు తాగునీరు, రోడ్లు వేయాలని, అర్హులం దరికీ పక్కా ఇళ్లు మంజూరు చేయాలని, గిరిజన పంచాయ తీల్లో భూ ఆక్రమణలు అరికట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం రీసర్వే డీటీ సుబ్రహ్మణ్య శర్మకు వినతపత్రం అందజేశారు. కార్యక్రమంలో గిరిజన సంఘ నాయకులు సవర ధర్మారావు, మడ్డు ధర్మారావు, ఎస్.గురునాథ్, అజయ్, ఎస్.భావన, గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

విద్యావ్యవస్థ బలోపేతానికి కృషి: బగ్గు


పాఠశాల భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బగ్గు

జలుమూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): విద్యా వ్యవస్థ బలోపేతానికి కూటమిప్రభుత్వం కృషి చేస్తోం దని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. దరివాడ గ్రామంలో నూతనంగా నిర్మించిన ప్రాథమిక పాఠశాల భవనాన్ని సోమవారం ప్రారంభించారు. ప్రతి ఒక్కరు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిం చాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వెలమల రాజేంద్రనాయుడు, నేతలు బగ్గు గోవిందరావు, పంచిరెడ్డి రామచంద్రరావు, గొండు స్వామిబాబు, వెలమల చంద్రభూషణరావు, సంపతిరావు చెత్తారావు, మన్మథరావు, విద్యాశాఖాధికారులు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

స్వీయ రక్షణపై దృష్టి సారించాలి

నరసన్నపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మహిళలు స్వీయ రక్షణపై దృష్టి సారించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని మహిళా శిశు సంక్షేమశాఖాధికారి బోర కవిత అన్నారు. సోమవారం ఉర్లాం ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు వివిధ అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పిస్తూ.. పాఠశాల, బయట, ఇంట్లో ఏ విధంగా ఉండాలో వివరించారు. బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరమని, వీటిని వ్యతిరేకించాలని కోరారు. ఆడపిల్లలు అత్యవసర సమయంలో 100 నెంబర్‌కు కాల్ చేసి రక్షణ పొందవచ్చన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం హర్షవర్థన్ పాల్గొన్నారు.

నట్టల నివారణ మందు పంపిణీ చేయాలి

నందిగాం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేయాలని జిల్లా గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం ప్రధాన కార్యదర్శి పాలిన సాంబమూర్తి కోరారు. ఈ మేరకు సోమవారం నందిగాంలో విలేకరులతో మాట్లాడుతూ.. గ్రామాల్లో మూగజీవాలకు వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడంతో పాటు పీపీఆర్ వ్యాక్సీన్ ఉచితంగా వేయాలన్నారు. గొర్రెల సహకార సంఘాలకు ఎన్‌సీడీపీ రుణాలు సబ్సిడీపై అందించాలని, గొర్రెలు, మేకలకు షెడ్లు మంజూరు చేయాలని కోరారు.

ఎస్ఏ-1 ప్రశ్న పత్రాలు సిద్ధం

నందిగాం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం నుంచి ప్రారంభం కానున్న ఎస్ఏ-1 పరీక్షలకు సంబంధించి ప్రశ్నాపత్రాలు సిద్ధం చేస్తున్నారు. ఎంఆర్‌సీకి ప్రశ్నాపత్రాలు రాగా వాటిని ఎంఈవో టి.నర్సింహులు ఆధ్వర్యంలో సీఆర్పీలు మండల ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు విభజించారు. వీటిని స్కూల్ కాంప్లెక్స్‌ల వారీగా పంపిణీ చేయనున్నట్లు ఎంఈవో తెలిపారు.

అదానీతో ఒప్పందాలను రద్దు చేయాలి

పలాసరూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అదానీతో ఒప్పందాలను రద్దు చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. పార్టీ జాతీయ సమితి పిలుపులో భాగంగా సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు మాట్లాడుతూ.. అదానీ కుంభకోణంలో సంబంధం ఉన్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. మణిపూర్‌లో హింసాత్మక పరిస్థితులపై పార్లమెంటులో చర్చించాలని, అదానీతో ఆంధ్ర రాష్ట్రంలో అవినీతి, కుంభకోణంపై సమగ్ర విచారణ చేయించాలన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని డీటీ లక్ష్మీనారాయణకు అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు జి.గోవింద్, తిరుపతి రావు, జోగారావు, టి.రవి పాల్గొన్నారు.